సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం ౹ 9 ౹ జూలై ౹ 2024



సోమశిలలో నీటి నిల్వ

సోమశిల: జలాశయంలో సోమవారానికి 10.022 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు నుంచి 286 క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 610 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.75,020
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,737
3 శాతం జీఎస్టీతో	రూ.6,939
సవర (8 గ్రా)	రూ.55,512

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.1 /26.6

జిల్లాలో మంగళవారం తెల్లవారుజాము వరకు మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. పగలు ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. వాతావరణంలో తేమ 59 శాతం ఉంది.

న్యూస్‌రీల్

నెలాఖరు వరకు ఇంటర్ ప్రవేశాలకు గడువు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఆర్ఐఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే చివరి అవకాశమన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గతంలో కంటే ఇసుక రేట్లు తక్కువే

- 'సాక్షి' కథనానికి స్పందించిన మైనింగ్ అధికారులు

నెల్లూరు (సెంట్రల్): టీడీపీ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఇసుక నూతన విధానంలో గతంలో కంటే ధరలు తక్కువగా ఉన్నాయని జిల్లా మైనింగ్ శాఖ అధికారి శ్రీనివాసకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం 'సాక్షి' పత్రికలో 'ఇసుక ఉచితం కాదా!' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మైనింగ్ శాఖ అధికారులు స్పందించారు. గతంలో కంటే రేట్లలో చాలా తేడా ఉందని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఎనిమిది రీచ్‌ల నుంచి ఇసుక సరఫరా చేశామని చెప్పకనే చెప్పారు. ప్రస్తుతం మూడు డిపోల నుంచి ఇసుక సరఫరా చేస్తున్నామని తెలిపారు.

రేపు జాబ్‌మేళా

నెల్లూరు (టౌన్): ఇంటర్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్‌బీ ఆధ్వర్యంలో నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఈ నెల 10న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఈసీ, హెచ్‌ఈసీ, బైపీసీ, ఒకేషనల్ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఇంటర్‌లో 75 శాతం ఉత్తీర్ణత కలిగిన వారు అర్హులని చెప్పారు. జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులకు క్యాట్ టెస్ట్ నిర్వహించి అర్హత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు టెక్‌బీ ప్రోగ్రాంలో పాల్గొనేందుకు హెచ్‌సీఎల్ కంపెనీ నుంచి ఆఫర్ లెటర్ వస్తుందన్నారు. మొదటి 3 నెలలు క్లాసు రూం ట్రెనింగ్ మధురైలో, చివరి 9 నెలలు ఇంటర్న్‌షిప్ చెన్నైలో ఉంటుందన్నారు. ఇంటర్న్‌షిప్ సమయంలో రూ.10 వేలు ఉపకార వేతనం ఇస్తారన్నారు. https://bit.ly/techbeegoapలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందన్నారు. మరిన్ని వివరాలకు 77803 23850 నంబరులో సంప్రదించాలన్నారు.

ఫారెస్ట్ రేంజర్లుగా ఇద్దరికి పదోన్నతి



కావలి డివిజన్ అటవీశాఖ రేంజర్‌గా నియమితులైన మాల్యాద్రి

నెల్లూరు(అర్బన్): జిల్లా అటవీశాఖ పరిధిలో డిప్యూటీ రేంజర్లుగా పని చేస్తున్న ఇద్దరు అధికారులకు పదోన్నతులు ఇస్తూ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి చిరంజీవ్ చౌదరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు సోషల్ ఫారెస్ట్‌లో డిప్యూటీ రేంజర్‌గా, నెల్లూరు అటవీశాఖ (టెరిటోరియల్) ఇన్‌చార్జి రేంజర్‌గా పనిచేస్తున్న ఎస్.మాల్యాద్రిని పదోన్నతిపై రెగ్యులర్ ఫారెస్ట్ రేంజర్‌గా నియమించి కావలి డివిజన్‌కు బదిలీ చేశారు. ఆత్మకూరు డిప్యూటీ రేంజర్‌గా పనిచేస్తున్న మాధవరావును పల్నాడు జిల్లా వినుకొండ రేంజ్ అధికారిగా బదిలీ చేశారు.

సమృద్ధిగా నానో ఎరువుల నిల్వలు

- ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

ముత్తుకూరు: జిల్లాలో నానో యూరియా, నానో డీఏపీ, సాగరిక గోల్డ్, న్యూట్రాక్స్ మల్టీ న్యూట్రీయంట్లు అందుబాటులో ఉన్నాయని ఇఫ్కో జిల్లా మేనేజర్ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని పంటపాళెంలో సోమవారం ఆయన ఏడీఏ రాజ్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఓ జ్యోత్స్నారాణి తదితరులతో కలిసి వేరుశనగ రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువులపై పెట్టే ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్త మాట్లాడుతూ ద్రవ రూపంలో ఉన్న యూరియాను వినియోగిస్తే వృథాను అరికట్టవచ్చన్నారు. అనంతరం వేరుశనగ పొలాల్లో పర్యటించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. వీఏఏలు కరీమ్, రమణమ్మ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు రాలక.. సాగు సాగక

ఊరిస్తున్న రుతుపవనాలు

- బావురుమంటున్న చెరువులు
- ఆయకట్టులో ఖరీఫ్, మెట్ట పైర్ల సాగు ప్రశ్నార్థకం
- అన్నదాతల్లో ఆందోళన
- జిల్లాలో 1,761 ఇరిగేషన్ చెరువుల కింద ఇదే పరిస్థితి

మేఘాలు గర్జిస్తున్నా.. కారు మబ్బులు కమ్ముకుంటున్నా.. రుతువులు ఊరిస్తున్నా.. చినుకు కరువవుతోంది. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణులు ఏర్పడినా.. వాయుగుండాలుగా మారినా.. తుఫాన్లు పుట్టినా.. జిల్లాపై వరుణుడు కరుణ చూపలేదు. జిల్లాలో నగటు వర్షపాతానికి మించి కురిసినా కనీసం కుంటలు కూడా నిండని పరిస్థితి నెలకొంది. ప్రధాన జలవనరులైన చెరువులు చుక్క నీరు లేక బావురుమంటున్నాయి. జిల్లా జలనిధి అడుగంటిపోవడంతో ఖరీఫ్ సాగుకు నీటి కేటాయింపులు చేపట్టలేదు. బోర్లు, బావుల కింద మెట్ట పైర్లు వేద్దామనుకున్నా.. ఈ ఏడాది వేసవితాపానికి భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా.. సాగు ప్రశ్నార్థకంగా మారడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఉదయగిరి: జిల్లాలో వరుణుడి కరుణ కరువైంది. గడిచిన ఐదేళ్లలో పరిస్థితిని గమనిస్తే.. వరుసగా నాలుగేళ్లు కార్తె.. కార్తెకు కుండపోతగా కురిసిన వానలు గతేడాది మందగించాయి. చెరువులతో పాటు జలనిధిలో జలమట్టాలు సగానికి పరిమితమయ్యాయి. ఈ ఏడాది మే నెలలోనే తొలకరి తొంగి చూసిందే కానీ.. వానల జాడ కనిపించడం లేదు. దీంతో ప్రధాన ఇరిగేషన్ చెరువులన్నీ చుక్క నీరు లేక నెర్రెలు బారుతున్నాయి. ఈ ఏడాది జూన్ మొదటి వారంలోనే నైరుతి రుతుపవనాలు ఆగమనం చేసినా చిరు జల్లులకే పరిమితం అయింది. జిల్లాలో ముఖ్యంగా సోమశిల ప్రాజెక్ట్ కింద 4 లక్షల ఎకరాల్లో వరి సాగువుతోంది. గతేడాది స్వల్ప వర్షాభావంతో ప్రాజెక్ట్‌లో తగినంత నీరు చేరక పోవడంతో రెండో సీజన్‌లో కావలి కాలువ కింద సాగు చేసిన వరి కొంత మేర ఎండిపోయింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నాటికి ప్రాజెక్ట్‌లో నీరు అడుగంటింది. సోమశిల జలాలపై ఆధారపడి సాగు చేసే కనిగిరి రిజర్వాయర్‌లో కూడా నీరు లేదు. మెట్ట ప్రాంతంలో ఉన్న మైనర్ ప్రాజెక్టులు గండిపాళెం, రాళ్లపాడు, మోపాడు, నక్కలగండి జలాశయాల కింద గతేడాది



అడుగంటిన గండిపాళెం జలాశయం

పంటలు లేవు. ఈ ఏడాది కూడా చుక్క నీరు లేక వెలవెలపోతున్నాయి. వీటి పరిధిలో సుమారు 30 వేల ఎకరాలు బీడుగా మారింది. గతేడాది మెట్ట ప్రాంతంలో ఉన్న చెరువుల ఆయకట్టు పరిధిలో పంటలు లేక రైతులు ఇబ్బంది పడ్డారు. గడిచిన ఏడాది వానలు లేకపోవడం, ఈ ఏడాది కూడా ఇంత వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో కనీసం చిన్న కుంటల్లో కూడా నీరు లేక భూగర్భ జలాలు పెరగ లేదు. దీంతో మెట్ట ప్రాంతంలో బోర్లు అన్నీ వట్టిపోతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులు సాగుకు సన్నాహాలు చేసుకోలేని పరిస్థితి నెలకొంది.

చెరువుల్లోనూ అదే పరిస్థితి

జిల్లాలో 1,761 ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. వీటి పరిధిలో 2.81 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. వంద ఎకరాల్లోపు ఆయకట్టు ఉన్న చెరువులు 979 ఉండగా, ఆ పైబడి అయకట్టు ఉన్న చెరువులు 725 వరకు ఉన్నాయి. వీటిలో గతేడాది 50 శాతం చెరువులకు తగినంత నీరు చేరక పంటలు పండలేదు. ఈ ఏడాది కూడా ఇంత వరకు ఒక్క చెరువులో కూడా నీరు లేక వట్టిపోయాయి. రుతు పవనాలు చురుగ్గా ఉన్నట్లు వాతావరణ నిపుణులు చెబుతున్నా.. వానలు పడకపోవడం రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. వింజమూరు ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో 107 చెరువులు ఉండగా, వీటి పరిధిలో 19,650 ఎకరాలు ఆయకట్టు ఉంది. కానీ ఒక్క చెరువులో కూడా నీరు లేదు. ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలో 97 చెరువులు ఎండగా, 16,789 ఎకరాలు ఆయకట్టు ఉంది. అందులో కూడా అదే పరిస్థితి 1.88 టీఎంసీలు నిల్వ సామర్థ్యం ఉన్న గండిపాళెంలో నీరు డెడ్ స్టోరేజ్‌లో ఉంది. నక్కల గండి నీరు లేక ఎండిపోయింది. ఎక్కువ ఆయకట్టు ఉన్న ఆత్మకూరు, అనంతసాగరం, సీతారామపురం, జలదంకి, చిన్నక్రాక, వింజమూరు, గుండెమడకల, చాకలికొండ తదితర చెరువులు పూర్తిగా ఎండిపోయాయి.

కరువు విలయతాండవం



ఉదయగిరి మెట్ట ప్రాంతంలో వానలు లేకపోవడంతో కరువు విలయతాండవం చేస్తోంది. గతేడాది కూడా వర్షాలు లేక పైర్లు పండ లేదు. ఈ ఏడాది కూడా ఇంత వరకు వానలు లేవు. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో మెట్ట పైర్లు కూడా వేయలేకపోతున్నాం. ప్రభుత్వం రైతులు ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి.

– కాకు వెంకటయ్య, ఉదయగిరి

ఆశలన్నీ వర్షాల పైనే..



ఉదయగిరి మెట్ట ప్రాంతంలో వర్షాలు ద్వారా చెరువులకు నీరు చేరుతోంది. కానీ ఇంత వరకు సమృద్ధి స్థాయిలో వానలు లేకపోవడంతో నీరు చేరలేదు. సోమశిల ప్రాజెక్టుకు నీరు చేరాలంటే కృష్ణా బేసిన్‌లో వానలు పడాలి. కానీ ఇంత వరకు అక్కడ కూడా వానలు లేవు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వానలు బాగా కురిసే అవకాశం ఉంది. ఆ నెలలపైనే ఆశలు పెట్టుకోవాలి.

– రమణారావు, డీఈ, ఇరిగేషన్, వింజమూరు

సగటు వర్షపాతం మించినా..

జిల్లాలో ఈ ఏడాది తొలకరి ఆరంభం నుంచి సగటు వర్షపాతానికి మించి వర్షం కురిసినా చెరువులకు చుక్కనీరు చేరడం లేదు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా మే నెలలో సగటు వర్షపాతం 54.66 మి.మీ. కాగా, 43.33 మి.మీ. కురిసింది. జూన్‌లో అయితే 51.88 మి.మీ. వర్షపాతానికి 86.77 మి.మీ. వర్షపాతం నమోదైంది. జూలై మొదటి వారంలో 23.21 మి.మీ. సగటు వర్షపాతానికి ఇప్పటి వరకు 49.40 మి.మీ. వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లాలో ఉన్న 37 మండలాల్లో ఉన్న చెరువులన్నీ నెర్రెలు బారుతున్నాయి. వీటి పరిధిలో ఈ ఏడాది కూడా సాగు ప్రశ్నార్థకంగా మారింది. జూన్‌లో వర్షాలు లేకపోవడంతో ప్రధానంగా మెట్ట ప్రాంతాల్లో సాగు చేసే కంది, ఆముదం, అలసంద వంటి పంటలు కూడా రైతులు చేపట్టలేదు. ముందస్తుగా వానలు పడితే మెట్ట ప్రాంతంలో వరి సాగు చేసే ప్రాంతాల్లో సత్తువ పైర్లు పిల్లిపెసర, జనుము, జీలుగ కూడా సాగు లేదు. మొత్తం మీద గత ఐదేళ్ల సవ్యంగా పంటలు పండి రైతుల ఇంట్లో సిరులు కురవగా, ఈ ఏడాది సీజన్ ఆరంభంలోనే వానలు ముఖం చాటేస్తుండటం భవిష్యత్తుపై అన్నదాతల్లో బెంగ నెలకొంది.



చుక్కనీరు లేని చాకలకొండ చెరువు

సర్వేపల్లిని అవినీతిలో కాదు అభివృద్ధిలో నిలపండి

- సోమిరెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు
- చంద్రబాబు నిర్వాకంతో రాష్ట్రం నష్టపోయింది
- సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారు
- మాజీ మంత్రి కాకాణి

నెల్లూరు (పొగతోట): సోమిరెడ్డి సచ్చీలుడైతే సర్వేపల్లిని అవినీతిలో కాదు అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలపాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమిరెడ్డి ఒళ్లు దగ్గర, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని తెలిపారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాకాణి మాట్లాడారు. ఇద్దరు సీఎంల సమావేశంలో చర్చకు వచ్చిన విషయాలు పత్రికల్లో వచ్చాయన్నారు. వాటిపై ప్రజలు ఆందోళనలో ఉన్నారు. అందుకు సీఎం చంద్రబాబు, మంత్రులు సమాధానం చెప్పలేదని తాను మాట్లాడడం జరిగిందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి విలీన గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇస్తున్నారని ప్రశ్నించామన్నారు. పోర్టుల్లో భాగాలు, తిరుమలలో వాటాలు అడిగారని వార్తలు వచ్చాయన్నారు. వీటిపై ప్రజలకు స్పష్టత ఇవ్వకుండా నన్ను వ్యక్తిగతంగా తిట్టి.. చంద్రబాబు దగ్గర పరపతి సంపాదించుకోవాలని సోమిరెడ్డి తెగ ఆరాటపడుతున్నారని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో సీఎం చంద్రబాబు నిర్వాకం వల్ల రాష్ట్రానికి రావాల్సిన రూ.1.50 లక్షల కోట్లు నష్టపోవడం జరిగిందన్నారు. ఇద్దరు సీఎంల సమావేశంలో మీ అజెండా ఏమిటో చెప్పకుండా కుట్రపూరిత విషయాలను పక్కదారి పట్టిస్తున్నారని కాకాణి మండిపడ్డారు. ప్రధాన పత్రికల్లో పోలవరంపై వచ్చిన విషయాలను దాచి పెడుతున్నారని, ఇది అనుమానాలకు తావిస్తుందన్నారు. సోమిరెడ్డి రామోజీరావు కొడుకు కిరణ్ మోచేతి నీళ్లు తాగినా మాకు అభ్యంతరం లేదన్నారు. ఈనాడు పత్రిక ఇలాంటిది, సాక్షి పత్రిక అటువంటిది కాదు చెప్పాల్సింది.. జరిగిన విషయాలపై వివరణ ఇదని చెప్పాలన్నారు. సోమిరెడ్డికి నీతి, నిజాయతీ ఉంటే విచారణకు సిద్ధంగా ఉండాలన్నారు. నువ్వు, నీ సుపుత్రుడు అక్రమంగా, అన్యాయంగా నిబంధనలకు విరుద్ధంగా ఫ్లైయాష్ ద్వారా నెలకు ఒక్కొక్క బల్కర్‌కు రూ.లక్షల వసూలు చేస్తున్న విషయం వాస్తవం కాదా? అని నిలదీశారు. ఈ విషయంపై విచారణ జరిపించడానికి నువ్వు సిద్ధమా? మీ చంద్రబాబు సిద్ధమా అని ప్రశ్నించారు. ఏపీజెన్‌కో నుంచి ప్రతి రోజు 20 బల్కర్ల ద్వారా అక్రమంగా ఫ్లైయాష్ తరలిస్తున్నారన్నారు. నేను చేసే విమర్శలను నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. లేఅవుట్ల యజమానులను బెదిరించి అక్రమంగా వసూలు చేయలేదని సోమిరెడ్డి ప్రమాణం చేయాలన్నారు. దోచుకోవడానికి సోమిరెడ్డికి టీడీపీ లైసెన్స్ ఇచ్చిందన్నారు.



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

చికెన్ వ్యర్థాల వాహనం స్వాధీనం

విడవలూరు: మండలంలోని భద్రాచలం, ముదివర్తి గ్రామాల్లో చేపలకు ఆహారంగా వేసేందుకు చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని స్థానికులు పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు మండలంలో వివిధ ప్రాంతాల్లో చేపల సాగు చేస్తున్న కొందరు రైతులు బెంగళూరు, చెన్నై ప్రాంతాల నుంచి చికెన్ వ్యర్థాలను తీసుకువచ్చి చేపలకు ఆహారంగా వేస్తున్నారు. ఈ చేపలను తింటున్న ప్రజలు అనారోగ్య పాలవుతుంటే.. వ్యర్థాలను తరలించే వాహనం వెళ్లిన తర్వాత కూడా కిలోమీటరు మేరకు దుర్గంధం వెదజల్లుతోంది. ఈ పరిస్థితిపై మత్స్యశాఖ అధికారులు, పోలీసులు స్పందించక పోవడంతో చికెన్ వ్యర్థాలను విచ్చలవిడిగా తరలిస్తున్నారని స్థానికులు ఆ వాహనాన్ని అడ్డగించి పోలీసులకు అప్పగించారు.



గ్రామస్తులు పట్టుకున్న చికెన్ వ్యర్థాల వ్యాన్

పేదవాడి గుండెచప్పుడు వైఎస్సార్

- ఆయన జీవించి ఉంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందేది
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (పొగతోట): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భౌతికంగా దూరమై పదిహేనేళ్లు గడిచినా ప్రతి గుండెలో గూడు కట్టుకుని ఉన్నారంటే దేశ రాజకీయాల్లో ఆ కీర్తి ఆయనకే దక్కుతుందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మహానేత వైఎస్సార్ 75వ జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కాకాణి, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కార్యాలయంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. సుమారు 300 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రస్తావన వస్తే.. వైఎస్సార్ పూర్వం.. వైఎస్సార్ శకం అని చెప్పుకునే పరిస్థితి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉందన్నారు. అన్ని వర్గాల సంక్షేమ, అభివృద్ధి కోసం వైఎస్సార్ అనేక కార్యక్రమాలు అమలు చేశారన్నారు. ఉచిత విద్య, రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ సేవలు వైఎస్సార్ అమలు చేశారన్నారు. పేద ప్రజలకు ఆహార భద్రత కల్పించారని గుర్తు చేశారు. వైఎస్సార్ జీవించి ఉంటే ఆంధ్రప్రదేశ్ విడిపోయేది కాదన్నారు. వైఎస్సార్ ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధి అందాలని కాంక్షించారని, ఆయన ఆశయాన్ని తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యరూపంలోకి తెచ్చారన్నారు. ప్రతి వ్యక్తికి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అందించేలా చర్యలు చేపట్టారన్నారు. వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి నెల్లూరు బ్యారేజీలకు శంకుస్థాపన చేశారన్నారు. జగన్ సీఎం అయిన తర్వాత సంగం, నెల్లూరు బ్యారేజీలను పూర్తి చేసి రైతుల పక్షాన నిలిచారన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీని వైఎస్సార్ తీసుకువచ్చారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా వైఎస్సార్ ఎన్నో గొప్ప సంస్కరణలు అమలు చేశారన్నారు. దేశంలో రాష్ట్రాన్ని అత్యున్నత స్థాయిలో ఉండేలా చర్యలు చేపట్టారన్నారు. శ్రీసిటీని వైఎస్సార్ పాలనలోనే తీసుకువచ్చారన్నారు. జగన్ పాలనను దూరం చేసుకున్నందుకు ప్రజలందరూ బాధపడుతున్నారన్నారు. జగన్ పాలనను తిరిగి తెచ్చుకునేందుకు ప్రతి ఒక్కరూ ఆలోచిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర కన్వీనర్ ఖలీల్‌అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భారీ కేక్‌ను కట్ చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఖలీల్ అహ్మద్ తదితరులు



రక్తదానం చేస్తున్న యువకులు, అభిమానులు, చిత్రంలో కాకాణి, చంద్రశేఖరరెడ్డి, ఖలీల్ అహ్మద్ తదితరులు

రొట్టెల పండగకు పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ ఓ ఆనంద్

నెల్లూరు (దర్గామిట్ట): బారాషహీద్ దర్గా రొట్టెల పండగకు దేశ విదేశాల నుంచి భక్తులు వస్తారని, ఇందు కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రొట్టెల పండగ ఏర్పాట్లపై నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17న షహదత్‌తో ప్రారంభమయ్యే రొట్టెల పండగ 21తో ముగుస్తుందన్నారు, దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 15 లక్షల మందికి పైగా భక్తులు హాజరయ్యే ఈ పండగకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా దర్గా పరిసర ప్రాంతాలు, ఘాట్లలో, పార్కింగ్ ప్రదేశాల్లో శానిటేషన్‌కు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఆయా శాఖలకు కేటాయించిన పనులు నిర్దిష్ట సమయంలోగా పూర్తయ్యే విధంగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. భక్తుల భద్రతకు తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. పండగ రోజుల్లో నగరంలో ట్రాఫిక్ ఇబ్బంది రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఇతర జిల్లాల నుంచి పోలీసులను రప్పించి, కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పార్కింగ్ ప్రదేశాలు సులువుగా గుర్తించే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. స్వర్ణాల చెరువులో నీటి నిల్వలు ఉండే విధంగా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. 24 గంటలు స్పెషలిస్ట్ డాక్టర్లతో కూడిన వైద్య బృందాలు, 108 అంబులెన్సులను అందుబాటులో ఉంచాలన్నారు. నెల్లూరు రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ల నుంచి స్వర్ణాల చెరువుకు వచ్చేందుకు తగిన బస్ సర్వీసులను ఏర్పాటు చేయాల్సిందిగా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. రొట్టెల పండగకు వచ్చే భక్తులు జిల్లాలోని ప్రసిద్ధ కసుమూరు, ఏఎస్‌పేట దర్గాలను సందర్శించే అవకాశం ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో శానిటేషన్, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. పరిశుభ్ర వాతావరణంలో స్నానాలు చేసేందుకు, దర్గాను దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సౌజన్య, ఇన్‌చార్జి డీఆర్‌ఓ పద్మావతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



రొట్టెల పండగ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

కాలనీల నిర్మాణాలకు బ్రేక్

- థర్మల్ ప్రాజెక్టుల నుంచి విడుదల కాని నిధులు
- 309 గృహాలకు గానూ 55 పూర్తి
- ఏడాదిగా నిలిచిన వైనం



నేలటూరు గ్రామస్తులకు నిర్మించిన గృహాల్లో పూర్తయినవి

ముత్తుకూరు: మండలంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల కాలుష్యం కారణంగా ఏళ్ల తరబడి నలిగిపోతున్న నేలటూరు పంచాయతీకి ఇప్పట్లో మోక్షం లభించేలా లేదు. కాలుష్యం నడుమ కునారిల్లుతున్న ఈ గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించే ప్రక్రియకు నిధుల కొరత కారణంగా బ్రేక్ పడింది. ఫలితంగా మోడల్ కాలనీల నిర్మాణం నిలిచిపోయింది. కాలుష్యం నుంచి ఈ పంచాయతీని రక్షించేందుకు గానూ 2019 ఎన్నికలకు ముందు కాలనీల నిర్మాణానికి హడావుడిగా శంకుస్థాపన చేశారు.

309 ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదన

గ్రామాలను ఖాళీ చేసే కుటుంబాలకు మోడల్ కాలనీల నిర్మాణాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రారంభించారు. నేలటూరు గ్రామస్తులకు నెల్లూరు రూరల్ మండలంలోని మాదరాజుగూడూరు సమీపంలో రూ.68 కోట్ల అంచనాలతో సకల సౌకర్యాలు కలిగిన 309 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నేలటూరు పట్టపుపాళెం వాసులకు ధనలక్ష్మీపురం వద్ద రూ.38 కోట్లతో 171 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టారు. నేలటూరు దళితవాడను తరలించేందుకు అవసరమైన సురక్షిత ప్రాంతాన్ని నేటికీ ఎంపిక చేయలేదు.

విశాలమైన స్థలంలో..

నేలటూరు గ్రామస్తుల కోసం విశాలమైన, పటిష్టమైన ఇళ్లను నిర్మించాలని సంకల్పించారు. ఇందులో భాగంగా ఒక్కో ఇంటిని 9.5 అంకణాల కట్టుబడితో అన్ని సౌకర్యాలతో నిర్మించేందుకు సుమారు రూ 13.25 లక్షలను వెచ్చించాలని నిర్ణయించారు. ప్రతి ఇంట్లో వరండా, హాల్, రెండు బెడ్ రూమ్‌లు, వంట గది, పూజ గదిని నిర్మించారు. అదే విధంగా నిర్మాణం జరిగే రెండు కాలనీల్లో రక్షిత మంచినీటి పథకాలు, విద్యుత్, డ్రెయిన్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రార్థన మందిరాలు, చౌక దుకాణం, ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హాల్, ధోబీఘాట్, లైబ్రరీ, బస్ షెల్టర్ ఉండేలా ప్లాన్‌కు రూపకల్పన చేశారు. కాలనీల విద్యుద్దీకరణకు రూ.రెండు కోట్ల మేరకు చెల్లించారు.

ప్రాజెక్టుల నుంచి నిధుల విడుదలేదీ..?

మాదరాజుగూడూరు వద్ద నేలటూరు గ్రామానికి సంబంధించి 55 ఇళ్లను పూర్తి చేశారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ధనలక్ష్మీపురంలో పట్టపుపాళెం గ్రామస్తుల 171 ఇళ్లు ప్రారంభ దశలో నిలిచిపోయాయి. ప్రాజెక్టుల నుంచి నిధులు విడుదలకు నోచుకోకపోవడంతో ఈ దుస్థితి తలెత్తింది. ఇప్పటి వరకు రూ.28 కోట్లను వెచ్చించగా, రూ.17 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. రూ.11 కోట్ల మేర బిల్లులు నిలిచిపోవడంతో ఇళ్ల నిర్మాణానికి బ్రేక్ పడింది. థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా సమకూరాల్సిన నిధులు పలు కారణాలతో విడుదల కాలేదు. ఈ పరిణామాలతో కాలనీలో ప్రస్తుతం ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. విద్యుత్ తీగలు, పరికరాలు చోరీకి గురయ్యాయి. ప్రతిష్టాత్మకంగా పూర్తి కావాల్సిన కాలనీకి గ్రహణం పట్టింది. జాప్యంతో అంచనా వ్యయం సైతం భారీగా పెరిగే పరిస్థితి ఏర్పడింది.

త్వరితగతిన నిర్మించాలి



మాదరాజుగూడూరు, ధనలక్ష్మీపురం వద్ద నిలిచిపోయిన కాలనీల నిర్మాణాన్ని కొత్త ప్రభుత్వం చేపట్టాలి. పాత అంచనాలను సవరించి, థర్మల్ ప్రాజెక్టుల ద్వారా నిధులను విడుదల చేయించాలి.

– ఈపూరు కోటారెడ్డి, నేలటూరు

నిధుల కొరతతో..



ఏళ్ల తరబడి కాలుష్య సమస్య వెంటాడుతోంది. నేలటూరు కాలనీల నిర్మాణం నిలిచిపోవడం దురదృష్టకరం. కొత్తగా ఎన్నికైన పాలకులు చొరవ చూపి కాలనీల నిర్మాణానికి కృషి చేయాలి.

– బసవంగారి ఈశ్వరయ్య, మాజీ సర్పంచ్, నేలటూరు

కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టరేట్‌కు అర్జీదారులు పోటెత్తారు. వీరి నుంచి అర్జీలను స్వీకరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రజలు అందజేసిన అర్జీలకు పరిష్కార మార్గాన్ని చూపాలని కోరారు. మొత్తం 260 అర్జీలు అందాయని చెప్పారు. ఇన్‌చార్జి డీఆర్వో పద్మావతి, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీఈఓ రామారావు, సీపీఓ రాజు, డీపీఓ సుస్మిత, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎంహెచ్ఓ పెంచలయ్య, డ్వామా పీడీ శ్రీనివాసులు, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటరమణ, జిల్లా మేనేజర్ లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు రూరల్ పరిధిలోని అక్కచెరువుపాడు వద్ద 2017లో చేపట్టిన మైనార్టీ గురుకుల పాఠశాల పనులు నత్తనడకన సాగుతున్నాయని, త్వరితగతిన పూర్తి చేయాలని ఆవాజ్ నెల్లూరు కమిటీ నేతలు వినతిపత్రమిచ్చారు. జిల్లాలో మైనార్టీలుగా ఉన్న మహమ్మద్‌లకు బీసీ – ఈ సర్టిఫికెట్‌ను ఇచ్చేందుకు వీఆర్వోలు, తహసీల్దార్లు నిరాకరిస్తున్నారని, సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.
- వెంకటేశ్వరపురంలోని టిడ్కో గృహాల్లో మౌలిక వసతులను కల్పించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్ కోరారు. ఈ అంశమై వినతిపత్రాన్ని సమర్పించారు.
- జిల్లాలో నాలుగు లక్షల మంది గిరిజనులు ఉన్నారని, వీరిలో చాలా మంది పౌష్టికాహార, రక్తహీనత లోపాలతో బాధపడుతున్నారని యానాదుల సంక్షేమ సంఘ నేతలు పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ ద్వారా వీరికి రక్తాన్ని ఉచితంగా అందించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు.
- కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వైద్యసేవలను అందించామని, తమ కడుపులు కొట్టొద్దని ఆశ వర్కర్లు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఆశ వర్కర్ల సంఘ జిల్లా అధ్యక్షురాలు కంచుపాటి విజయలక్ష్మి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోపు సమస్యలు పరిష్కరించాలి



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న సౌజన్య

నెల్లూరు(క్రైమ్): నిర్ణీత గడువులోపు సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఏఎస్పీ సౌజన్య ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఆమె సోమవారం నిర్వహించారు. వివిధ సమస్యలపై 75 మంది వినతిపత్రాలను సమర్పించారు. వీటిని పరిశీలించిన అనంతరం సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. చట్ట పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని.. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, తల్లిదండ్రుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఏఎస్పీ క్రైమ్స్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం



అగ్నికి ఆహుతైన గృహోపకరణాలు

ఆత్మకూరు: పట్టణంలోని టెక్కేవీధిలో గల ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ఆదివారం రాత్రి సంభవించింది. వివరాలు.. స్థానికంగా నివసిస్తున్న అలీ ఇంట్లో షార్ట్‌సర్క్యూటై మంటలు వ్యాపించాయి. దీంతో టీవీ, వాషింగ్ మెషీన్, మిక్సీ, ఫ్యాన్లు తదితర పరికరాలు అగ్నికి ఆహుతయ్యాయి. నిద్రిస్తున్న సమయంలో మంటలు, పొగలు వ్యాపించడంతో ఇంట్లోని వారు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. సమీపంలోని వారు విద్యుత్ సిబ్బందికి సమాచారమివ్వగా, వారు అక్కడికి చేరుకొని సరఫరాను నిలిపేశారు. ప్రమాద కారణంగా దాదాపు రూ.రెండు లక్షల నష్టం సంభవించిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్: (లైవ్)	రూ.137
లేయర్ (లైవ్)	రూ.115
బ్రాయిలర్ చికెన్:	రూ.246
స్కిన్‌లెస్ చికెన్:	రూ.274
లేయర్ చికెన్:	రూ.195



నిబంధనలు పాటించకపోతే చర్యలు

- అమరావతి ఫ్యామిలీ రెస్టారెంట్ మూసివేతకు నోటీసులు
- ఎంహెచ్ఓ వెంకటరమణ



అమరావతి ఫ్యామిలీ రెస్టారెంట్‌లో ఎంహెచ్ఓ తనిఖీలు

నెల్లూరు(బారకాసు): ప్రజారోగ్య పరిరక్షణకు గానూ నెల్లూరు నగరపాలక సంస్థ నిర్దేశించిన ప్రమాణాలను పాటించని రెస్టారెంట్లు, ఇతర ఆహార ఉత్పత్తుల విక్రయ కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని ఎంహెచ్ఓ వెంకటరమణ హెచ్చరించారు. మాగుంట లేఅవుట్లోని అమరావతి ఫ్యామిలీ రెస్టారెంట్‌లో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ నేతృత్వంలో ప్రత్యేక బృందం తనిఖీలను సోమవారం చేపట్టింది. రెస్టారెంట్ నిర్వహణకు కార్పొరేషన్ నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు పొందలేదని.. ఎన్‌ఓసీ, ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండానే కొంతకాలం నుంచి కొనసాగిస్తున్నారనే అంశాన్ని గుర్తించారు. రెస్టారెంట్ వంటశాల ఫ్రీజర్‌లో మిగిలిపోయిన ఆహార పదార్థాలను నిల్వ ఉంచడంతో పాటు కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మాంసాహారాన్ని గుర్తించి వాటిని నిర్వీర్యం చేశారు. కిచెన్ ప్రాంగణంలో ఎలుకలు, పందికొక్కులు తిరుగుతూ ప్రమాదకర పరిస్థితులు ఉండటంతో నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న అమరావతి ఫ్యామిలీ రెస్టారెంట్ మూసివేతకు నోటీసులు జారీ చేసిన ఆయన రూ.50 వేల జరిమానాను విధించారు. మూడు రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని.. ఇది సంతృప్తికరంగా లేకపోతే రెస్టారెంట్‌ను శాశ్వతంగా మూసేసేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

డ్రైవింగ్ చేస్తూ.. ఫిట్స్‌కు గురై

- అదుపుతప్పిన మినీ స్కూల్ బస్సు
- నిలిపి ఉన్న ఐదు కార్లను ఢీకొన్న వైనం



కార్లను ఢీకొన్న బస్సు

నెల్లూరు(క్రైమ్): మినీ స్కూల్ బస్సును నడుపుతున్న డ్రైవర్‌కు అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చాయి. ఈ క్రమంలో బస్సు అదుపుతప్పి నిలిపి ఉన్న ఐదు కార్లను ఢీకొంది. వివరాలు.. ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన మినీ బస్సు అయ్యప్పగుడి నుంచి మినీబైపాస్ వైపునకు వెళ్లింది. అయ్యప్పగుడి ఫ్లయ్ ఓవర్ దిగుతున్న సమయంలో బస్సు నడుపుతున్న డ్రైవర్‌కు ఫిట్స్ వచ్చాయి. దీంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఐదు కార్లను ఢీకొని ఆగిపోయింది. ఘటనలో కార్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. చికిత్స నిమిత్తం డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో విద్యార్థుల్లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.55

సన్నవి : రూ.40

పండ్లు : రూ.30



కులం పేరుతో దూషించారని ఫిర్యాదు



బాధితురాలితో కలిసి మాట్లాడుతున్న రవికుమార్

వెంకటాచలం: విధుల్లో ఉన్న తనను కులం పేరుతో దూషించడమే కాకుండా మెడపై చేయి పెట్టి హాస్పిటల్ నుంచి బయటకు గెంటేసేందుకు యత్నించారంటూ బాధితురాలు నక్కా ఝాన్సీరాణి వెంకటాచలం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితురాలి వివరాల మేరకు.. వెంకటాచలంలోని సీహెచ్‌సీలో శానిటరీ సూపర్‌వైజర్‌గా రెండేళ్లుగా ఆమె పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తుండగా, వెంకటాచలానికి చెందిన సండి రమేష్, కనుపూరుకు చెందిన ధనుంజయ, మరో నలుగురొచ్చారు. తాము చెప్పిన వ్యక్తులే ఇక్కడ విధులు నిర్వర్తించాలంటూ ఉద్యోగులందరూ చూస్తుండగానే ఆమె మెడపై చేయి వేసి బయటకు గెంటేందుకు యత్నించారు. ఆమె ప్రతిఘటించడంతో కులం పేరుతో దూషించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఝాన్సీరాణిని కులం పేరుతో దూషించిన వ్యక్తులపై అట్రాసిటీ కేసును నమోదు చేసి చర్యలు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు.

శ్రీచైతన్య స్కూల్ బ్రాంచ్ మూసివేత



నెల్లూరు(టౌన్): నగరంలోని పార్థసారథినగర్‌లో గల శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ బ్రాంచ్ యాజమాన్యానికి నోటీస్‌ను ఎంఈఓ భిక్షాలు జారీ చేశారు. దీంతో స్కూల్‌ను సోమవారం మూసేశారు. ఎలాంటి అనుమతుల్లేకుండానే పాఠశాలను నిర్వహిస్తున్నారంటూ కోర్టును ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నేతలు ఆశ్రయించారు. ఈ తరుణంలో హైకోర్టు ఉత్తర్వులతో కలెక్టర్, డీఈఓ ఆదేశాలతో స్కూల్‌ను మూయించారు.

పొదుపు గ్రూపుల బాహాబాహీ

నెల్లూరు(పొగతోట): డైకస్ రోడ్డులోని అన్న కాంటీన్లో మహిళా మార్టు ఏర్పాటుకు టీఎల్ఎఫ్ – 1, 5 నుంచి సుమారు రూ.15.9 లక్షలను వసూలు చేశారు. అయితే దీని ఏర్పాటులో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ పొదుపు మహిళలు తిరగబడ్డారు. పొదుపు మహిళల సమావేశాన్ని సోమవారం నిర్వహించగా, పార్టీల వారీగా పొదుపు మహిళలు విడిపోయి బాహాబాహీకి దిగారు. రూ 2.8 లక్షలను ఏమి చేశారంటూ ఒకరిపై ఒకరు దురుసుగా మాట్లాడారు. వివాదం పెద్దది కావడంతో పోలీసులు రంగప్రవేశం చేసి సర్దిచెప్పారు.



పందిని తప్పించబోయి..

- బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



గాయపడిన వెంకటేశ్వర్లు

మర్రిపాడు: పందిని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని డీసీపల్లి ఉత్తరకాలువ బ్రిడ్జి వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన వెంకటేశ్వర్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఇన్సురెన్స్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో నెల్లూరు నుంచి ప్రొద్దుటూరుకు బైక్‌పై వెళ్తుండగా, మార్గమధ్యలో డీసీపల్లి ఉత్తర కాలువ బ్రిడ్జి వద్ద పంది అడ్డొచ్చింది. దీన్ని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పింది. గాయపడిన ఆయన్ను హైవే అంబులెన్స్‌లో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

11న డయల్ యువర్ డీఎం

నెల్లూరు సిటీ: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నగరంలోని రెండో డిపోలో గురువారం నిర్వహించనున్నామని మేనేజర్ శివకేశవ్‌యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, సూచనలు, సమస్యలను తెలిపేందుకు గానూ 99592 25642 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

టిప్పర్ ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

నెల్లూరు(క్రైమ్): టిప్పర్ ఢీకొనడంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన నగరంలోని ప్రశాంతినగర్ జంక్షన్ వద్ద గల జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. వెంకటాచలం మండలం నిడిగుంటపాళేనికి చెందిన ప్రసాద్, సుబ్బమ్మ (58) దంపతులు విడవలూరు మండలం వావిళ్ల నుంచి బైక్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో ప్రశాంతినగర్ జంక్షన్ సమీపంలో గల జాతీయ రహదారి వద్దకొచ్చేసరికి వెనుక నుంచి మితిమీరిన వేగంతో వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఘటనలో సుబ్బమ్మ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందారు. ప్రసాద్ హెల్మెట్ ధరించి ఉండటంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్సై గీతారమ్య ఘటన స్థలానికి చేరుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

